క్లుప్తంగా

చర్య తీసుకోవాలి

ఆత్మకూరు : అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ దర్శనానికి వచ్చిన తన భర్తతో పాటు తనపై చేయి చేసుకున్న డివిజనల్ స్థాయి పోలీస్ అధికారిపై చర్యలు తీసుకోవాలని నర్మెట్ట మండలం మాన్సింగ్ తండాకు చెందిన భక్తురాలు పద్మిని ఆరోపించింది. తన భర్త శ్రీనివాస్ వాహనం పార్కింగ్ చేస్తుండగా ఎలాంటి సమాచారం లేకుండా ఓ పోలీస్ అధికారి ఇష్టారీతిగా కొట్టాడని, అడ్డుకోబోయిన తనపై కూడా చేయి చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. తమను కొట్టిన పోలీస్‌అధికారిపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేసింది.

బాధిత కుటుంబానికి పరామర్శ



కమలాపూర్ : మండలంలోని గూడూరులో ఇటీవల మృతి చెందిన సీఆర్పీఎఫ్ జవాన్ కుటుంబాన్ని ఎక్స్ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వరంగల్) ఆధ్వర్యంలో బుధవారం పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి కొంత ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎలిగేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎం.సుధాకర్, సభ్యులు వంగరి రాజేష్, అబ్బాస్, రాజు, భిక్షపతి, మాజీ సర్పంచ్ అంకతి సాంబయ్య పాల్గొన్నారు.

సారలమ్మను దర్శించుకున్న 'సిరికొండ'



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక సమ్మక్క–సారలమ్మ మినీ జాతరకు ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి హాజరయ్యారు. బుధవారం రాత్రి సారలమ్మను దర్శించుకొని మొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ .. తాను భూపాలపల్లి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మినీ జాతరను అభివృద్ధి చేశానని గుర్తుచేశారు. రానున్న రోజుల్లో భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు గుర్రం రవీందర్, నాయకులు గౌస్, సారయ్య, రాజయ్య, కొమురయ్య, సుదర్శన్, రాకేష్, సాయికృష్ణ, విజయ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్ల చదువు.. ఇంటికే వెలుగు

కాజీపేట: ఆడ పిల్లలు చదువుకుంటే ఆ ఇంటిలోని వారంతా చైతన్యవంతులవుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాన్ని కాజీపేట పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు అంగన్‌వాడీ కేంద్రం సేవలపై అవగాహన కల్పించారు. ఆడ పిల్లల చదువు, మానవ అక్రమ రవాణా, తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో ఎం.మానస, వాసవిదేవి, జ్యోతి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

యాంటీ హిమోఫిలియా మందుల అందజేత

ఎంజీఎం: హిమోఫిలియా సొసైటీ, వరంగల్ చాప్టర్ ఆధ్వర్యంలో హిమోఫిలియా ఫెడరేషన్ సహకారంతో హిమోఫిలియా వ్యాధిగ్రస్తులకు (ఇంటర్ విద్యార్థులకు) సుమారు రూ.2 లక్షల విలువైన యాంటీ హిమోఫిలియా ఫ్యాక్టర్ 8, 9 ఇంజెక్షన్లను ఎంజీఎం సూపరిండెంటెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ వైద్యం గౌతమ్, అంబీ శ్రీనివాస్ బుధవారం పంపిణీ చేశారు. మార్చిలో పరీక్షలు జరగనున్న పదవ తరగతి విద్యార్థులకు కూడా మందులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. హిమోఫిలియా సొసైటీ వరంగల్ చాప్టర్ జనరల్ సెక్రెటరీ, వైస్ ప్రెసిడెంట్ నరెడ్ల శ్రీనివాస్, సభ్యుడు సుమన్‌కుమార్ పాల్గొన్నారు.

మోసం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం

వరంగల్ చౌరస్తా: ప్రజలు, రైతులు, కార్మికులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోసం చేస్తోందని రైతు సంఘాల నాయకులు విమర్శించారు. ఈమేరకు వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో నల్ల బ్యాడ్జీలతో బుధవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు రాచర్ల బాలరాజు, కోరబోయిన కుమారస్వామి, వీరగోని శంకరయ్య, సుంచు జగదీష్, ఐలయ్య, ఫణి, బషీర్, పాషా, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు అభినందనలు

వరంగల్: వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ఇటీవల విధుల్లో చేరిన జి.సంధ్యారాణిని వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రామ్‌కిషన్ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, రాష్ట్ర కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి పాలకుర్తి సదానందం, ఉపాధ్యక్షులు దుర్గారావు, రాజు, సిటీ యూనిట్ కార్యదర్శి మధుచంద్ర పాల్గొన్నారు.



ఆత్మకూరు : వరాల కొండను తీసుకొస్తున్న పూజారులు



వేలేరు : అమ్మవారిని తీసుకువస్తున్న పూజారులు



కమలాపూర్ : పసుపు, కుంకుమ తీసుకొస్తున్న పూజారులు

గద్దెపై కొలువుదీరిన సారలమ్మ

- డప్పుచప్పుళ్లు, డోలువాయిద్యాల నడుమ గద్దెకు తీసుకొచ్చిన కోయపూజారులు
- నేడు గద్దెకు రానున్న సమ్మక్క
- వైభవంగా ప్రారంభమైన మినీ జాతరలు

ఆత్మకూరు : ఎక్కడ చూసినా ఎత్తుబెల్లాలు...శివసత్తుల పూనకాలు..జాతర పరిసరాలు ఆద్యంతం పులకించిపోయాయి. భక్తులు ఆనందసాగరంలో ఓలలాడారు. అగ్రంపహాడ్‌లో బుధవారం సారలమ్మ గద్దెపైకి చేరింది. భక్తుల పూనకాలు...కేరింతలు...నృత్యాల మధ్య పూజారులు సారలమ్మను గద్దెకు చేర్చారు. ఉదయం అగ్రంపహాడ్ గ్రామంలోని పూజారి గుల్లపల్లి సాంబశివరావు ఇంట్లో ప్రత్యేక పూజలు చేసి డప్పుచప్పుళ్లు, భక్తుల నృత్యాల మధ్య పసుపు కుంకుమను పోలీసు బందోబస్తు మధ్య గద్దెలపైకి చేర్చారు. పూజారి బొమ్మగాని సత్యం ఇంటి నుంచి వరాల కొండను, ప్రత్యేక తంతుతో వనంను తీసుకువచ్చారు. సారలమ్మ పూజారి గోనెల వెంకన్న సారలమ్మను భక్తిశ్రద్ధల తన్మయత్వంతో గద్దెమీదకు చేర్చారు. సమ్మక్క పూజారి గోనెల సారంగపాణి, గుల్లపెల్లి సాంబశివరావు ప్రత్యేక పూజలతో భక్తులకు ఆశీర్వచనాలు అందచేశారు. సారలమ్మ ఆగమనంతో భక్తులు వివిధప్రాంతాల నుంచి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఎత్తు బెల్లాలు సమర్పించుకున్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, జాతర చైర్మన్ శీలం రమేష్, ఎండోమెంట్ ఏసీ సునిత, తహసీల్దార్ జగన్ మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఈఓ శేషగిరి, ఏసీపీ కిశోర్‌కుమార్, సీఐలు సంతోష్, రవిరాజు, రవికుమార్, ఎస్సైలు ప్రసాద్, రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్యూటీ పాస్‌లు లేక ఇబ్బందులు

జాతరలో వైద్య ఆరోగ్య సిబ్బంది, విద్యుత్ సిబ్బందికి డ్యూటీపాస్‌లు జారీ చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. నాన్‌లోకల్ పోలీసులు డ్యూటీల్లో ఉండడంతో జాతరలో సేవలందించే సిబ్బందిని చెక్‌పోస్టుల వద్ద ఆపడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విధులు నిర్వర్తిస్తున్న తమకు పాస్‌లు ఇవ్వకపోవడం ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు.

మీడియాకు నో షెల్టర్..

జాతరలో కవరేజీ చేస్తున్న మీడియాకు సెంటర్ లేకపోవడంతో జర్నలిస్టులు జాతర పరిసరాల్లోనే ఉండి కవరేజీ చేశారు. గతంలో మాదిరిగా మీడియా సెంటర్ ఏర్పాటు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

కొరవడిన సమన్వయం..

జాతరలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉండగా ఎవరితీరు వారిదే అన్నట్లు ఉందని పలువురు మండిపడుతున్నారు. రెవెన్యూ, ఎండోమెంట్, పంచాయతీరాజ్ శాఖల మధ్య సమన్వయం లేదని ఆరోపణలు వినిపించాయి.

ఎల్కతుర్తి : జిల్లా వ్యాప్తంగా సమ్మక్క–సారలమ్మ మినీ జాతరలు వైభవంగా ప్రారంభమయ్యాయి. భీమదేవరపల్లి మండలం ముల్కనూరు, కొత్తకొండతో పాటు ఎల్కతుర్తి మండలం దామెరలో బుధవారం సారలమ్మను కోయపూజారులు గద్దెకు తీసుకొచ్చారు. డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, డోలు వాయిద్యాల నడుమ అమ్మవారిని వైభవోపేతంగా గద్దె మీదకు తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. వరాలతల్లి సమ్మక్క నేడు గద్దెకు రానుంది. కోయపూజారులు సమీపంలోని ఆలయాల్లో వరాహంను బలిఇచ్చి చిలకలగుట్ట నుంచి డప్పుచప్పుళ్లతో సమ్మక్కను గద్దెకు చేర్చనున్నారు.

పటిష్ట బందోబస్తు

ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సైలు గోదారి రాజ్‌కుమార్, సాయిబాబు, నీలోజు వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో కలిసి జాతర ప్రాంగణాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. అలాగే మండల అధికారులు, కార్యదర్శులు, సుమారు 250మంది జీపీ సిబ్బందితో కలిసి జాతరలో తమ సేవలు కొనసాగిస్తున్నారు.

కమలాపూర్ : రెండేళ్లకోసారి జరిగే సమ్మక్క–సారలమ్మ మినీ జాతర మండల కేంద్రంతోపాటు కన్నూరు, మాదన్నపేట, మర్రిపల్లిగూడెం గ్రామాల్లో బుధవారం వైభవంగా ప్రారంభమైంది. జాతర ఉత్సవ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఉదయం ఆయా గ్రామాల నుంచి డప్పుచప్పుళ్ల నడుమ శోభాయాత్రగా తీసుకెళ్లిన పసుపు, కుంకుమలతో వనదేవతల గద్దెలను అలంకరించారు. సాయంత్రం సారలమ్మను వనం నుంచి గద్దెపైకి తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. భక్తులు మొక్కులు చెల్లించుకోగా శివసత్తులు పూనకాలతో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



ఆత్మకూరు : దోలువాయిద్యాలతో ఊరేగింపుగా..

శాయంపేట : మండలంలోని జోగంపల్లిలో సమ్మక్క–సారలమ్మ మినీ జాతర బుధవారం ప్రారంభమైంది. గ్రామంలోని కొండా జనార్దన్ ఇంటి నుంచి వీరబోనాన్ని, తడక ఈశ్వర్ ఇంటి నుంచి ఘటం కుండ, మైలారం గ్రామం నుంచి పసుపు కుంకుమను డప్పుచప్పుళ్ల నడుమ జాతర ప్రాంగణానికి తీసుకొని వచ్చారు. మేడారం నుంచి వచ్చిన గిరిజన పూజారులు రాజక్క, జంపయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ అబ్బు ప్రకాశ్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు, మూడు గ్రామాల పెద్దలు అమ్మ ధర్మయ్య ఇంటి నుంచి సారలమ్మ డప్పుచప్పుళ్లు, డోలు వాయిద్యాల నడుమ గద్దెపైకి తీసుకొచ్చి ప్రతిష్ఠించారు.

నడికూడ : మండలంలోని కంఠాత్మకూర్, పులిగిల్లలో సమ్మక్క–సారలమ్మ మినీ జాతర ప్రారంభమైంది. బుధవారం సాయంత్రం సారలమ్మను పూజారులు గద్దలపైకి తీసుకొచ్చారు. భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు.

వేలేరు : పీచర, ఎర్రబెల్లి గ్రామాల్లో బుధవారం డప్పుచప్పుళ్లు, డోలు వాయిద్యాలతో సారలమ్మను శోభాయాత్రగా తీసుకెళ్లి గద్దెల ప్రాంగణంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కోయ పూజారులు ప్రత్యేక పూజలు చేసి సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజును గద్దెలపైకి తీసుకువచ్చి ప్రతిష్ఠించారు.



శాయంపేట : సారలమ్మను గద్దెపైకి తీసుకొస్తున్న పూజారులు



ఎల్కతుర్తి : తల్లిని గద్దెకు తీసుకొస్తున్న కోయపూజారులు



ఎల్కతుర్తి : దప్పుచప్పుళ్లతో సారలమ్మను తీసుకొస్తూ..

బస్సు టికెట్ల కోసం ఎండలో భక్తులు



పరకాల : మేడారం వెళ్లే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని పాలకులు, అధికారులు చెపుతున్న మాటలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్ల వద్ద చలువ పందిళ్లు, టెంట్లు ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు టికెట్ల కోసం ఎండలోనే నిల్చోని ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ అధికారులు ఇప్పటికైనా చలువ పందిళ్లు, టెంట్ సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.



ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి

ధర్మసాగర్ : విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి అజ్మీరా గోపాల్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జ్ఞానం వలనే సంపద లభిస్తుందని, ప్రతి విద్యార్థి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పట్టుదలతో సంవత్సరంలోనే అడ్మిషన్లు పెరగడంతోపాటు కళాశాలలో మౌలిక సదుపాయాలు పురుగోతిచెందాలని అన్నారు. విద్యార్థులకు చదువు విషయంలో సాహాయ, సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎన్ఎస్ఎస్ అధికారి జ్యోతి, అధ్యాపకులు కర్ణాకర్, రాములు, వెంకట్, గణేశ్, గోపాలకృష్ణ, ఆజమ్, మంజుల, ప్రభాకర్, శ్రీకాంత్, స్వర్ణలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజ్మీరా గోపాల్

ఒకేదేశం ఒకేభాష నినాదం మంచిదికాదు

ఐనవోలు : ఒకేదేశం ఒకేభాష భారతీయులకు మంచిదికాదని ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో అంతర్జాతీయ మాతృబాష దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పలు రకాల సాంస్కృతిక, విజ్ఞాన పోటీలు నిర్వహించారు. అదే విధంగా హ్యాండ్ రైటింగ్, ప్రింటెడ్‌నోట్ బుక్కులు, పెన్సిల్స్‌ను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. భారత దేశ సంస్కృతి, సంప్రదాయాలను భాష, ప్రాంతాల పరంగా పరిశీలిస్తే ప్రతి రాష్ట్రానికి ఒక్కోరకమైన భాష ఉందన్నారు. అలాగే ఒకే రాష్ట్రంలోని ప్రజలు వారి ప్రాంతాలను బట్టి వ్యావహారికమైన భాషలు మాట్లాడుతారన్నారు. తెలంగాణలోనే తెలుగు, ఉర్దూ, బంజార తదితర మాతృభాష కలిగి ఉన్నట్లు చెప్పారు. ఒకేదేశం ఒకేభాష నినాదం సరికాదని అన్నారు. దేశంలో ఈశాన్య రాష్ట్రాల్లో ఇంగ్లిష్, ఉత్తర భారతంలో హిందీ, దక్షిణ భారతంలో ద్రావిడ భాష, తూర్పు, మధ్య భారతంలో బెంగాలీ, ఒరియా, మరాఠీ తదితర భాషలు మాతృభాషగా మాట్లాడుతారన్నారు. అందరు ప్రాథమిక విద్య మాతృభాషలోనే కొనసాగించి, మంచి జ్ఞానసముపార్జన గావిస్తే ఇతర భాషలు నేర్చుకోవడం సులభం అవుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో విద్యా వారధి జిల్లా అధ్యక్షుడు బీమళ్ల సారయ్య, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, మధుకర్, మహేందర్, మహేందర్‌రెడ్డి, భవన్, నాగేశ్వర్ రావు, పద్మ, మాధవి, సరళ, సునీత పాల్గొన్నారు.



పుస్తకాలను చూపిస్తున్న విద్యార్థులు

పాఠశాలల్లో స్వయంపాలన దినోత్సవం

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో (పెట్రోల్ పంపు) స్వయపాలన దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు.. హెచ్‌ఎంగా, ఉపాధ్యాయులుగా, పీఈటీగా, డీఈఓగా వ్యవహరించి ప్రతిభను చాటారు. తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా సయ్యద్ యూసుఫ్, అయేషాఫర్వీన్, శోభ, వెంకటలక్ష్మి వ్యవహరించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం పద్మావతి ఉపాధ్యాయులు జిలుకర ఏకాంతం, హజీరా, భాస్కర్, మోజెస్, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యారణ్యపురి: విద్యార్థినులతో ఉపాధ్యాయులు

పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం

హన్మకొండ: హసన్‌పర్తిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సదర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, విద్యాశాఖాధికారులుగా వ్యవహరించారు. ఉపాధ్యాయులుగా తోటివారికి పాఠ్యాంశాలను బోధించారు. కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవడుతాయని చెప్పారు. హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

ఆత్మకూరు : మండల పరిధిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురు గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వల్లెంపల్లికి చెందిన 15మంది యాత్రికులు బొలెరో వాహనంలో మేడారం వెళ్తున్నారు. ఈ క్రమంలో మండల కేంద్రం సమీపంలోని కల్వర్టుకు వాహనం ఢీ కొట్టడంతో డ్రైవర్ ప్రవీణ్‌తో పాటు మరో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న ఏసీపీ కిశోర్‌కుమార్, స్థానిక పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ ప్రవీణ్ వాహనంలో ఇరుక్కుపోవడంతో గ్యాస్‌కట్టర్‌తో కట్ చేసి బయటకు తీశారు. అలాగే కటాక్షపూర్ సమీపంలో మేడారం నుంచి బైక్‌పై వస్తున్న వెంకన్నను గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలి

శాయంపేట : పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలని బాలల పరిరక్షణ విభాగం సభ్యులు దామోదర్, రమేష్ సూచించారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు వార్షిక పరీక్షల సన్నద్ధతపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం గూర్చి వివరించారు. విద్యార్థులు పరీక్ష సమయంలో ఏకాగ్రత వహించి మొక్కవోని దీక్షతో ఇష్టపడి చదవాలన్నారు. సమాజంపై అవగాహన, ఒడిదుడుకులను ఎలా తట్టుకోవాలి, వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ సుభాషిణిదేవి తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు వాటా కల్పించాలి

హన్మకొండ: చట్టసభల్లో ఓ బీసీలకు వాటా కల్పించాలని ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు బీసీ మహా పాదయాత్ర కరపత్రాలను హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల నాయకులు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాలో తామెంతో చట్టసభల్లో ఆ మేరకు వాటా కల్పించాలని కోరుతూ మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం మిరుగోన్‌పల్లి నుంచి మార్చి ఒకటిన బీసీ మహా పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ వైస్ చైర్మన్ వెలుగు వనితక్క, ఆయా సంఘాల నాయకులు డాక్టర్ చిత్తం ప్రవీణ్ కుమార్, ఏటిగడ్డ అరుణక్క, చాపర్తి కుమార్ గాడ్గే, పద్మజాదేవి, దిడ్డి ధనలక్ష్మి, సద్గుణ, కూనూరు రంజిత్ గౌడ్, ఐతం నగేష్, రాచకొండ ప్రవీణ్ కుమార్, సిద్ధి రాజుయాదవ్, గోధుమల కుమారస్వామి పాల్గొన్నారు.

జనమంతా మేడారం వైపే



పరకాల : సమ్మక్క–సారలమ్మ దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో మేడారం తరలివెళ్తున్నారు. పట్టణాలు, గ్రామాలు, మారుమూల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో బయలుదేరారు. దీంతో ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్లు భక్తులతో రద్దీగా కనిపించాయి. పట్టణంలోని పశువుల సంతలో 220 ఆర్టీసీ బస్సులతో ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్ వద్ద భక్తుల రద్దీ నెలకొంది. మహాలక్ష్మీ పథకం ద్వారా మేడారానికి మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్తున్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.